ప్రజాశక్తి
శుక్రవారం 23 మే 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఉపాధ్యాయుల బదిలీల జాతర

హెచ్‌ఎంలకు ముగిసిన దరఖాస్తుల గడువు - 24 వరకు ఎస్‌ఎలకు, 27 వరకు ఎస్‌జిటిలకు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోగా బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. జిల్లాలో దాదాపు 12,500 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 6 వేల మంది వరకు బదిలీకి అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, ఒక చోట ఎనిమిదేళ్లు పూర్తిచేసిన ఉపాధ్యాయులు బదిలీలకు సాధారణ అర్హులుగా ఉంటారు. వీరితోపాటు ఒకేచోట రెండేళ్లు సర్వీసు చేసిన వారు విజ్ఞప్తి ప్రాతిపదికన బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులను తీసుకునే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. బదిలీ దరఖాస్తులకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలన్నీ ఈనెల 31వ తేదీ నాటికి

ఉండాలని నిర్ణయించారు.

ప్రధాన ఉపాధ్యాయులు బదిలీకి గురువారం తుది గడువుకావడంతో ఇప్పటికే వీరంతా దరఖాస్తులు చేశారు. స్కూలు అసిస్టెంట్లకు ఈనెల 24 వరకు, ఎస్‌జిటిలు ఈనెల 27 వరకు దరఖాస్తుచేసుకునేందుకు చివరితేదీగా నిర్ణయించారు. స్కూలు అసిస్టెంట్‌నుంచి హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందే వారికి 30వ తేదీన వెబ్ ఆప్షన్లు ఇచ్చి 31 వారికి ఉత్తర్వులు ఇస్తారు. సీనియార్టిల జాబితాల విడుదలకు కూడా షెడ్యూలు ప్రకటించారు. ఇప్పటికే పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 711 పాఠశాలలను మోడల్ స్కూల్సుగా ఎంపిక చేశారు. ఈ పాఠశాలలో కనీసం 4 ఉపాధ్యాయులు తగ్గకుండా ఉండేలా చూడాలని నిర్ణయించారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు బోధన చేయాల్సి ఉంది. ప్రతిపంచాయతీలో మోడల్ స్కూలు ఏర్పాటుకు 711 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ ఆదర్శ పాఠశాలలకు ఇప్పటికే ఉపాధ్యాయుల ఎంపిక కూడా జరిగింది. దీంతో ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీల చట్టం వర్తించదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో ఒకటి నుంచి ఐదు వరకు ఒక పాఠశాల ఉండేలా చర్యలు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 3139 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పనిచేస్తున్న 12,500 మందిలో 8 ఏళ్లు, ఐదేళ్లు పూర్తి చేసిన వారు 5,500 మంది వరకు బదిలీకి సిద్ధంగా ఉండగా విజ్ఞప్తి ప్రాతిపదికన మరో 500 మంది వరకు ఉండవచ్చునని అధికారులు

2లో

మాట్లాడుతున్న రమాదేవి

ప్రజల ఐక్యతను దెబ్బతిసేందుకు బిజెపి యత్నం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి
- బిజెపి విధానాలనే అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, ప్రజల మధ్య ఐక్యను దెబ్బతీటానికి యత్నిస్తున్న కేంద్రంలోని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి అన్నారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్ అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయని, మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులను కూడగట్టి ఐక్యంగా పోరాడాలని, దేశాన్ని రక్షించుకోవాలని అన్నారు. ఇటీవల కాలంలో కాశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారత పౌరులు మరణించారని దీనికి కారణమైన ఉగ్రవాదులను శిక్షించాలని, అయితే ఈ పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలను నిలువరించాలని కోరారు. నిరంతరం యుద్ధాన్ని ప్రోత్సహించే అమెరికా అధ్యక్షులు ట్రంప్ భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని నిలుపుదల చేసింది తానేనంటూ ప్రకటించిండంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలడి డిమాండ్ చేశారు. అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తోందని, ఈ విధానాలకు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం బిజెపి విధానాలనే అమలు చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలోను, రాజధానికి నిధులు కేటాయింపు, ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు విషయంలో కేంద్రాన్ని నిలదీయడంలో వెనకాడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు జరపాలని, విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనకు పూనుకుంటామని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు నగరంలో ముందుచూపుతో వ్యవహరించి

2లో

నాటు వైద్యం, ఇంటివద్ద ప్రసవాలు ప్రాణాంతకం

- ప్రభుత్వాస్పత్రుల్లో ఆల్ట్రాస్కానింగ్ సదుపాయం
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతోపాటు జైలుశిక్ష
- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గర్భిణులు నాటువైద్యం, ఇళ్ల వద్దే ప్రసవాలు మానుకోవాలని, అర్హులైన వైద్యుల వద్దే వైద్యం పొందాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి సూచించారు. నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుండి గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. గర్భిణిలు, బాలింతాలు క్రమం తప్పకుండా వైద్యుల సలహాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందటం ద్వారా మాతాశిశు మరణాలను నియంత్రించొచ్చని, 9 నెలల గర్భకాలంలో కనీసం రెండు సార్లు స్కానింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని పేర్కొన్నారు. గర్భస్థ శిశువుల పెరుగుదల తెలుసుకునేందుకు, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యాలు నిర్ధారించడం కోసం ప్రతి గర్భిణి అర్హులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఉచిత ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సౌకర్యం ఉందని తెలిపారు. పిసి అండ్ పిఎన్ డిటి యాక్ట్ - 22 ప్రకారం ప్రైవేట్

2లో

కాల్వలను తలపిస్తున్న కాలనీ రోడ్లు

ప్రజాశక్తి - మేడికొండూరు

వర్షం నేపథ్యంలో పేరేచర్ల వైఎస్ కాలనీలోని పలు రహదార్లు చెరువులను తలపిస్తున్నాయి. ఈ కాలనీ ఏర్పడి 20 ఏళ్లయినా సరైన రహదార్లు లేనికారణంగా వర్షం వచ్చిన ప్రతిసారీ రోడ్లపై నీరు నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు అవాంతరం ఏర్పడడంతోపాటు కొన్ని సందర్భాల్లో ఇళ్లల్లోకి సైతం నీరు వస్తోంది. మరోవైపు డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేని కారణంగా రోజుల తరబడి నీరు నిలిచి దోమలు వ్యాపించి ఆ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ కాలనంలో సిసి రహదార్ల నిర్మాణానికి 2019లో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ శంకుస్థాపన చేసినా పనులు మాత్రం చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు వచ్చిన ప్రతిసారీ ఇళ్లల్లోకి నీటితోపాటు పాములు, తేళ్లు వస్తున్నాయని, అధికారులకు చెప్పినా వారూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా తమ కాలనీవైపు అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడాలని కోరుతున్నారు.

కుడికాల్వకు తాగునీరు విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడికాల్వకు గురువారం నీటిని విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు అదేశాలతో కుడికాల్వ 2, 3 గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. తాగునీటి అవసరాల నిమిత్తం 4 టీఎంసీల నీటిని రోజుకు 5,500 వేల క్యూసెక్కుల చొప్పున 8 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నీటితో కుడికాల్వ పరిధిలోని చెరువులను, కుంటలను నింపాలని అధికారులు సూచించారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-విజయవాడ

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో రాజకీయ పక్షాలు అధికారులకు సహకరించాలని, అర్హులైన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌వో లక్ష్మీనరసింహం సమావేశం నిర్వహించారు. ఈసీఐ ఆదేశాల మేరకు ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈఆర్‌వో, డీఈవో, సీఈవో తమతమ పరిధిలో ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పక్షాలు వారి బూత్ లెవెల్ అసిస్టెంట్లకు సూచనలు చేసి వారి పరిధిలోని బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు సహకరించాల్సిందిగా కోరారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో ఎవరైనా మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా వారి పేర్లను బీఎల్‌వోకు తెలియపరచాలన్నారు. ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఉంటే వారి విషయమై ఫారం-8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. జిల్లాలో ఫారం 6, ఫారం 7, ఫారం 8 అర్జీలకు సంబంధించిన వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందజేశారు. రాష్ట్రానికి సంబంధించి శ్రీకాకుళం నుంచి బాపట్ల జిల్లా వరకు 1 నుంచి 100 నంబర్ల నియోజకవర్గాల వరకు ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో బీఎల్‌వో లేదా బీఎల్‌వో సూపర్‌వైజర్‌కు జూన్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో మొదటి విడత శిక్షణ ఉంటుందని ఎన్నికల సంఘం తెలియజేసినట్లు వివరించారు. సమావేశంలో రాజకీయ పక్షాల ప్రతినిధుల సందేహాలను డీఆర్‌వో నివత్తి చేశారు.సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సలీమ్, డీవీ కృష్ణ (సీపీఎం), కె.పరమేశ్వరరావు (ఆప్), తరుణ్ కాకాని (బీజేపీ), బి.అనిల్ (టీడీపీ), జె.శ్రీనివాస్ (జనసేన) పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభిస్తున్న తులసి రామచంద్రప్రభు

హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి- విలేకర్లు

గుంటూరు రూరల్ పరిధిలోని ఏటుకూరులో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈకార్యక్రమానికి తులసి సంస్థల అధినేత తులసి రామచంద్రప్రభు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య ఆధ్వర్యంలో మేళ తాళాలతో, కోలాటం మాస్టర్ నాగం రేణుకాదేవి అండ్ టీం కోలాటం, నత్యాలతో ఉత్సవాలు జరి పారు. కర్రసాము గురువులు జిడుగు సుబ్బారావు, వర్మ, వెంకట్‌ల ఆధ్వర్యంలో కళాకారులు కర్రసాము విన్యాసాలు చేశారు. అనంతరం పదిహేను వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని తులసి రామచంద్రప్రభు ప్రారంభించారు. హనుమాన్ జయంతి వేడుకలకు సహకరిస్తున్న తులసి రామచంద్ర ప్రభుని కమిటీ వారు శాలువాతో సత్కరించారు. పెదకాకానిలోని రెడ్డివారి బావి దగ్గర ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో సువర్చల సమేత హనుమత్ కళ్యాణం జరిపించారు. స్వామివారిని ఐజి సరిత దర్శించుకున్నారు. సుమారు 8,000 మందికి అన్న ప్రసాద వితరణ చేశామని నిర్వాహకులు తెలిపారు. పొన్నూరులో మజ్జిగ పంపిణీ చేశారు. క్రోసూరు, దుర్గిలో హనుమాన్‌జయంతి వేడుకలు నిర్వహించారు.

యోగాంధ్ర కార్యక్రమాలపై ఇన్‌ఛార్జి కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - గుంటూరు

'యోగా' ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని, యోగా మెరుగైన జీవనానికి దోహదపడుతుందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జూన్ 21 వరకు జరగనున్న యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ అమలుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి జిఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలితో కలిసి ఎంపిడిఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల, గ్రామస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 21వ తేదిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని విశాఖపట్నం వేదికగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి హాజరయ్యే యోగా దినోత్సవానికి 5లక్షల మందికి తగ్గకుండ గిన్నీస్ రికార్డ్ సాధించేలా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో జరిగే యోగా కార్యక్రమం ప్రజలకు ఆశక్తి కల్పించడానికి రాజకీయ నాయకులు, సర్పంచులు, వార్డుమెంబర్లు, ఎంపిటిసిలు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ డైరక్టర్లు, చైర్మెన్‌ను కలుపుకొని చేపట్టాలన్నారు. మండల, గ్రామాలలో 100, 150 మంది యోగా చేసేందుకు విలున్న ప్రదేశాలను స్కూల్స్, కాలేజీలు, గోడౌన్స్ ను గుర్తించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు, యోగా గురువులు, వైజాగ్ వెళ్ళటానికి ఆశక్తి కలిగిన వారు యోగాంధ్ర వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతన్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ

ఉపాధ్యాయుల బదిలీల జాతర

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. సెకండరీగ్రేడ్ టీచర్లు, తత్సమానకేడర్లు నుంచి స్కూలు అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించేందుకు జాబితాలను రూపొందించారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరించారు. హెచ్‌ఎంల బదిలీ తరువాత స్కూలు అసిస్టెంట్లకు కూడా ప్రధాన ఉపాధ్యాయుల ప్రమోషన్ జాబితాలను ఈనెల 27న విడుదల చేసి 29 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈనెల 31న తుది జాబితాలను ప్రకటిస్తారు. వీరికి ఒకటి రెండో తేదీల్లో వెబ్‌ఆప్షన్‌లను ఇచ్చి 4న బదిలీ ఉత్తర్వులిస్తారు. ఎస్‌జిటిల నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందే వారికి ఐదున కౌన్సెలింగ్ నిర్వహించి 6న ఉత్తర్వులు ఇస్తారు. ఎస్‌జిటిల సీనియారిటీ జాబితాలను ఈనెల 31న విడుదల చేస్తారు. జూన్ 2 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఏడోతేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చి 11వ తేదీన బదిలీల ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

నాటు వైద్యం, ఇంటివద్ద ప్రసవాలు ప్రాణాంతకం

(మొదటి పేజీ తరువాయి)

స్కానింగ్ సెంటర్‌లు, మేనేజ్మెంట్ ఏ విధమైన ఛానల్, అప్లైన్, ఇకమార్స్, ప్లాట్ ఫామ్, గూగుల్, ట్విట్టర్, వాట్సప్, టెలిగ్రామ్, పోస్టల్, యూట్యూబ్, పంప్లెట్, గోడపత్రికలు, హోర్డింగ్స్ ఇతర ప్రచార సాధనాలు ద్వారా కూడా స్కానింగ్ సెంటర్‌కు సంభందించి స్కానింగ్ ముందు గాని, తరువాత గాని లింగ నిర్ధారణ గురించి ప్రకటనలు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలు మీరితే జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, దానిని ప్రోత్సహించిన వారికీ 3 నుండి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు నుండి రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఏ హాస్పిటలైనా డయాగ్నొస్టిక్ సెంట్రల్ గాని, రిజిస్టర్ కాకుండా నిర్వహిస్తున్నట్లు గాని తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజల ఐక్యతను దెబ్బతిసేందుకు బిజెపి యత్నం

(మొదటి పేజీ తరువాయి)

శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, నిధులను బట్టి కాకుండా భవిష్యత్ ప్రజావసరాల దష్ట్యా బ్రిడ్జి నిర్మాణం జరగాలన్నారు. గుంటూరు ఛానల్, వరికెపూడిసెల, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. గుంటూరు నగరంలో బృందావన్ గార్డెన్స్ వద్ద అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియాన్ని ప్రభుత్వ రంగంలోనే పూర్తి చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే మద్దతు ధరకు కొనగోలు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వి.జవహర్‌లాల్, బి.లక్ష్మణరావు, ఎంఎ.చిష్టీ, ఎల్.అరుణ, యు.దుర్గారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

దేవి శ్రేష్ఠ గోల్డ్, డైమండ్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నాణ్యమైన వజ్రా భరణాలతో దేవి శ్రేష్ఠ గోల్డ్ అండ్ డైమండ్స్ తన నూతన షోరూమ్‌ను సినీ నటి నిధి అగర్వాల్ గురువారం ప్రారంభించారు. విజయవాడ జైహింద్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటైన షోరూమ్‌ను దేవి శ్రేష్ఠ గోల్డ్ అండ్ ఫైనాన్స్ డైమండ్స్ నిర్వాహకులు వంకదారు జగదీష్, వంకదారు సుధాకర్, బోడ్డు మురళీ కృష్ణ, మడుపల్లి అనీష్, టీడీపి యువ నాయకులు బోండా రవితేజతో కలసి ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నిధిఅగర్వాల్ షోరూమ్‌ను సందర్శించి తనకు నచ్చిన వజ్ర భరణాన్ని ధరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆభరణం అందాన్ని మరింత పెంచుతుందని, ఇప్పుడు ప్రతి ఒక్కరు ఆభరణాలను తమకు కావాల్సిన డిజైన్‌లో చేయించుకుంటున్నారనీ అన్నారు. డైమండ్ వినియోగం చాలా పెరిగిందని, కొనుగోలుదారుల ఆలోచనలకు అనుగుణంగా విభిన్నమైన డిజైన్స్‌ను దేవి శ్రేష్ఠ గోల్డెన్ డైమండ్స్ అందిస్తుందని చెప్పారు. టిడిపి యువ నాయకులు బోండా రవితేజ మాట్లాడుతూ విజయవాడ నగరం బంగారు వ్యాపారానికి పెట్టింది పేరు అని చెప్పారు. నగరంలో అధునాతన మోడల్స్‌తో దేవి శ్రేష్ఠ గోల్డ్ అండ్ డైమండ్స్‌ను ప్రారంభించడం అభినందనీయం అన్నారు. అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన బంగారు వజ్ర ఆభరణాలను వారు అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం షోరూమ్ నిర్వాహకులు మాట్లాడుతూ విభిన్నమైన డిజైన్స్‌తో దేవి శ్రేష్ఠ గోల్డ్ అండ్ డైమండ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొనుగోలుదారుల ఆలోచనలకు అనుగుణంగా ఆభరణాలను విభిన్నమైన డిజైన్స్‌తో అందించడం తమ ప్రత్యేకతన్నారు.

మాట్లాడుతున్న సినీ నటి నిధి అగర్వాల్



ఆహార నియమాలతో పిసిఒఎస్‌కు చికిత్స

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి.అని, ఆహార నియమాలు పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని మ్యాక్స్ హెల్త్ కేర్ రీజినల్ హెడ్ రీతికా సమర్ధ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. పిసిఓఎస్‌తో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడటంతో పాటుగా మొత్తం ఆరోగ్యం, జీవక్రియ, బరువును ప్రభావితం చేస్తుంది అన్నారు. పిసిఓఎస్ బారిన పడినవారు తమ జీవనశైలి మార్పులు చేసుకోవటం ముఖ్యమైనప్పటికీ, తాము తీసుకునే ఆహారానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాన్నారు.. పోషకాలతో నిండిన ఆహారం ఆరోగ్యాన్ని తెస్తుందని, ఆ తరహా ఆహారంలో బాదం ఒకటి అన్నారు. ఇవి రోజంతటికీ అవసరమైన శక్తిని అందిస్తాయని తెలిపారు. పిసిఓఎస్ బారినపడిన వారికి అనువైన, మరీ ముఖ్యంగా ఉదయం పూట సులభమైన, ఆరోగ్యకరమైన అల్పాహార ఎంపికలను సిఫార్సు చేస్తున్నారనీ, బాదం, ఓట్ మిల్క్ బ్రేక్‌ఫాస్ట్ స్మూతీ, క్వినోవా ఉప్మా, బాదంపప్పు పిండి పాన్ కేక్, ఆరోగ్యకరమైన మూంగ్ దాల్ చిల్లా, టాపింగ్స్‌తో హోల్ వీట్ టోస్ట్‌లు పిసిఓఎస్‌తో ఇబ్బంది పడేవారికి అనువైన అల్పాహారాలుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

వైసిపి పాలనలో ప్రజలను దోచుకున్నారు

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య

ప్రజాశక్తి - క్రోసూరు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019-2024 వరకు రాష్ట్రంలో ప్రజలు డబ్బు వేల కోట్లు, వేల ఎకరాలు భూములు గనులు దోచుకున్నారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాంద్రు కాశయ్య పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఎస్టేట్లో అటవీ భూములు ఆక్రమించుకున్నారన్నారు. 220 కోట్ల విలువ చేసే 63.72 ఎకరాలు అసైన్డ్ భూములు కబ్జా చేశారని చెప్పారు. గత ఐదు సంవత్సరాలు పరిపాలనలో ఎలాంటి టీచర్ పోస్టులు నియమించలేదన్నారు. భవిష్యత్తులో గాలి జనార్దన్ రెడ్డి పట్టిన గతి జగన్మోహన్ రెడ్డికి పడుతుందని స్పష్టం చేశారు. సొంత ఇంట్లో తల్లికి చెల్లికి ఆస్థి పంపకాలు చేయని వ్యక్తి, ప్రజా సమస్యలు ఎలా తీరుస్తాడు అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అనుముల వెంకట్రామిరెడ్డి, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహాను, మన్నెం శ్రీను, సలాము, మల్లాల రామాంజనేయులు, మన్నెం చంటి, హసన్, రామిరెడ్డి, సీత రెడ్డి, రాంబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

పద్మావతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

ఆశయాలు నెరవేర్చడమే నిజమైన నివాళి

ప్రజాశక్తి - పెద్దకూరపాడు

అమరుల ఆశయాలు నెరవేర్చడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజయ్ కుమార్ అన్నారు. నియోజకవర్గ సిపిఐకార్యాదర్శి మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన మునగోటి శ్రీనివాసరావు సతీమణి పద్మావతి గురువారం మరణించారు. సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజాసంఘాలు ప్రతినిధులు ఆమెకు నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ ఏవి ప్రసాద్, రాంబాబు, షేక్ హుస్సేన్, వి.రాము, శ్రీనివాస రావు, ముప్పాళ్ళ శివశంకర్, మునునూరి రమేష్ బాబు విటల్ రెడ్డి, బైరాపట్నం రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పీతల సుజాత

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకొస్తున్న నూతన సంస్కరణలకు అనుగుణంగా రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ పని చేస్తోందని రాష్ట్ర మహిళా సహకార ఆర్థికసంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత తెలిపారు. గురువారం స్థానిక మహిళా ప్రాంగణంలోని ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్ పర్సన్‌గా సుజాత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆమె కార్యాలయ ఆవరణలోని మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా సుజాత విలేకరులతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక ప్రజా సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తుందని, ముఖ్యంగా మహిళల సమస్యల పరిష్కారానికి సిఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ద్వారా నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలకు ఆదరణ కల్పించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దటానికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందని అమ్మకు వందనం పథకం త్వరలోనే అమలు చేస్తున్నారని, మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమల్లోకి తీసుకు రానున్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నైపుణ్య శిక్షణతోపాటు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా పీతల సుజాతను రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజ, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ రమణశ్రీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి విజయలక్ష్మి, కష్ణా జిల్లా మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ జుబేదా పర్వీన్ తదితరులు అభినందించారు.

పీతల సుజాతకు శుభాకాంక్షలు చెబుతున్న సంస్థ ఎమ్‌డి

మూడేళ్లు అవినీతి జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు?

మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకులు షేక్ జమాల్ బాష

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపాలిటీలో లక్షల రూపాయాల అవినీతి చోటు చేసుకుంటే, తనకు ఎటువంటి ప్రమేయం లేదని, తన వల్ల అవినీతి నిలిచిపోయిందని చైర్మన్ రఫాని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ ప్రతిపక్ష నాయకులు షేక్ జమాల్ బాష విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లా డుతూ గతంలో చైర్మన్ బాధ్యతులు చేపట్టి నప్పటి నుంచి అవినీతికి బీజం ఏర్పడిందన్నారు. మూడు సంవత్సరాల ఔట్ సోర్సింగ్ ఉద్యో గి లక్షల రూపాయల అవినీతికి పాల్పడితే తనకు తెలియ దని చైర్మన్ ప్రకటించటం చూస్తుంటే అతను ఎంత నటుడో అర్థమౌతోందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో, తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు అవినీతి జరిగితే, అతను పార్టీ మారి కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యాక మాత్రమే కుంబకోణానికి పాల్పడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. మున్సిపల్ ఉద్యోగుల వ్యవహారం తనకు ఎలా తెలుస్తుందని చైర్మన్ అమాకంగా ప్రశ్నిస్తున్నారని, ప్రజలు ప్రథమ పౌరుడిగా అవకాశం ఇచ్చిందీ అవినీతిని అంతం చేసి స్వచ్ఛమైన, పారదర్శకమైన పాలన అందించ టానికే నన్నారు. కానిమున్సిపాలిటీ పరిధిలో ఇంతటి అవినీతి చోటు చేసుకుంటే దానిని ఆపటా నికి ప్రయత్నం చేయలేదని, నాటి మంత్రి, మంత్రి మరిది చెప్పిన ప్రతి మాటకు తల ఊపుతూ మున్సిపాలిటీని అవినీతి మయం చేశారని మండిపడ్డారు. తప్పు చేసిన ఔట్ సోర్సిం గ్ ఉద్యోగిపై ఈ ఏడాది జనవరి వరకు కేసులు ఎందుకు పెట్ట లేదని ప్రశ్నించారు. చిన్న కేసులోనే ముద్దాయిలను రోజుల వ్యవధిలోనే పోలీసులు అరెస్టు చేస్తున్నారని, దొంగ సొత్తును రికవరీ చేస్తున్నారని అటువంటిదీ మూడు సంవత్సరాల పాటు ప్రజాధనాన్ని లూటీ చేసిన ఉద్యో గిని ఎందుకు అరెస్టు చేయలేదని, ప్రజాధనాన్నిరికవరీ చేయలేదని ప్రశ్నించారు. ఆమెను అరెస్టు చేస్తే కొంత మంది భాగోతం గుట్టు రట్టు అవుతుందని భయపడుతున్నారా.. అని ప్రశ్నించారు. ప్రజా సేవ చేయటానికి ప్రజలు అవకాశంఇచ్చినప్పుడు నీతితో నిజాయితీతో పని చేయాలన్నా రు.

తెనాలిలోని జ్యూయలరీ షాపులో దొంగతనం

రూ.1.45 కోట్ల విలువైన బంగారం మాయం - గైర్హాజరైన వ్యక్తిపై అనుమానంతో ఫిర్యాదు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని ఓ జ్యుయలరీ షాపులో బంగారం మాయమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. షోరూములో మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి గైర్హాజరు కావడంతో అతనిపై అనుమానంతో యజమాని ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ పోలీసులు వెల్లడించిన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన అనిల్‌కుమార్ జైన్ చౌదరి స్థానిక గంగానమ్మపేట పాత శివాలయం సమీపంలోని జ్యూయలరీ షోరూమ్‌లో స్టాక్ మేనేజర్‌గా ఐదేళ్లుగా పని చేస్తున్నాడు. అతను ఈ నెల 14వ తేదీన కనబడకుండా పోవడంతో, అతని అన్న వినోద్‌కుమార్ జైన్ తన సోదరుడు కనబడడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ పోలీసులు 15న కేసు నమోదు చేశారు. 14న షోరూమ్‌కు అనిల్‌కుమార్ జైన్ రాకపోవడంతో అనుమానం వచ్చి స్టాక్‌ను పరిశీలించుకున్న షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ బన్సాలీ రమేష్ కుమార్ ముత్తా, 1509 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. అపహరకు గురైన సొత్తు విలువ రూ. 1.45 కోట్లు ఉంటుందని, తమకు న్యాయం చేయాలని రమేష్ కుమార్ ముత్తా పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ సీఐ రాముల నాయక్ గురువారం కేసు నమోదు చేశారు.

క్రోసూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. క్రోసూరులో బుధవారం సాయంత్రం భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీటితోపాటు మురుగునీరు చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నాలుగు రోడ్ల సెంటర్ అమరావతి వైపు వెళ్లే కూడలిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS :: GUNTUR
Dispute No.25 / 2024

Between:
M/s. Margadarsi Chit Fund Pvt.Ltd., Market Centre, Guntur. .... Disputant
And
Mr.Borra.Anka Raju and Others ....Opponents

To
OPP. NO.1: MR.BORRA ANKA RAJU, S/O B.SIVA RAMAIAH,A/A.36 YRS RES:D.NO.13-108, NEAR BOAD YARD, SEETHANAGARAM(PO), TADEPALLI (MDL), GUNTUR (DIST)-522 503.
OPP.NO.5: MR.PEETHA SIVA NAGA RAJU,S/O.P.PARAMESWARA RAO, A/A.39 YRS,RES:D.NO.20-8-28/1, 5TH LINE SEETHA RAM NAGAR, GUNTUR- 522 006

Please take notice that the above dispute is filed against Opponents 1 & 5 for Recovery of Rs.2,77,105/- (Rupees Two Lakhs Seventy Seven Thousand One Hundred and Five Only) and the same is posted to Dt. 10-06-2025 for the appearance of you before the Deputy Registrar of Chits O/o District Registrar, Guntur at 10:30 a.m. If you fail to attend the office of Deputy Registrar of Chits on that day the matter will be heard and decided exparte basis on the material available.

(By order of the Deputy Registrar of Chits)
Foreman / Branch Senior Manager,
Margadarsi Chit Fund Pvt, Ltd.,
Market Centre, Guntur.

మహారాజశ్రీ ఐదోవ జూనియర్ సివిల్ జడ్జి
విజయవాడ
ఒ.ఎస్.నెం. 844 ఆఫ్ 2022

బిట్వీన్ :
వణుకూరి నాగిరెడ్డి -ప్లయింటిఫ్
మరియు
1) గార్నెపూడి వెంకయ్య, సన్ ఆఫ్ రామయ్య, రెస్సిడెంట్ డోర్.నెం: 2-248, ఉండవల్లి గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.
2) గార్నెపూడి రత్నకుమారి, వైఫ్ వెంకయ్య రెస్సిడెంట్ డోర్.నెం: 2-248, ఉండవల్లి గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా. -డిఫెండెంట్స్

పై నెంబరు గల దావాలో ప్రతివాదులు అయిన మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకోక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీరు ఇరువురికి ది. 26-06-2025 ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను లేని యెడల దావా మీ పరోక్షమున తీర్మానింపబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
ఇట్లు
జె.వి. ప్రసాద్
M.Com., LL.M.,PGDCJ&FS
అడ్వకేట్ (10969), హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
డో.నెం.41-20/1-53/2, గుంటూరువారి వీధి, కృష్ణలంక, విజయవాడ-520013.
సెల్: 9440696216

భార్యను చంపిన కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - ఈపూరు

అనుమానంతో భార్యని చంపిన భర్తకు కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల మేరకు మండలంలోని కూచినపల్లి గ్రామానికి చెందిన మేరీని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన బొగ్గవరపు నాగాంజనేయులు అలియాస్ నాగరాజు 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. భార్య మేరీపై అనుమానంతో నాగాంజనేయులు తరచూ గొడవ పడుతుండడంతో పుట్టింటికి వచ్చిన మేరీని గ్రామ పెద్దలు సర్ది చెప్పి పంపించారు.మరలా గొడవలు జరగడంతో మేరీ పుట్టింటికి రాగా 2023 ఏప్రిల్ 9వ తేదీన కూచినపల్లిలో తిరునాళ్ల సందర్భంగా నాగాంజనేయులు గ్రామానికి వచ్చి భార్య మేరి పిండి వంటలు చేస్తుండగా కాపురం విషయంలో గొడవ పడి ఎవరూ లేని సమయం చూసి పొయ్యిమీద ఉన్న బాండీలోని వేడి నూనెను ఆమె పై పోయగా ముఖం, శరీరం,తొడలపై తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం గుంటూరు గవర్నమెంట్ హాస్పటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. చెందే ముందు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వి వెంకట్రావు కేసు నమోదు చేశారు. నరసరావుపేట డిఎస్పి కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్ ఎస్సై ఎం ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో సరైన సాక్ష్యాధా రాలను ప్రవేశ పెట్టగా కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు, ఏపీపీ దేశి రెడ్డి మల్లారెడ్డి కేసు నిరూపణలో కీలక పాత్ర పోషించగా 13వ అడిషనల్ జడ్జి కోర్టు నరసరావుపేట జడ్జి ఎన్ సత్య శ్రీ ముద్దాయి బొగ్గవరపు నాగాంజనేయులుకు 498 (A) సెక్షన్‌కు గాను మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష 10 వేలు జరిమానా, 302 సెక్షన్ కు గాను జీవిత ఖైదుతో పాటు 10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

అనంతవరప్పాడులో అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని అనంత వరప్పాడులోని ప్రసన్నాంజనేయ స్వామిని జనచైతన్య ప్రాపర్టీస్, శ్రేష్ఠ గ్రూప్ చైర్మన్ మాదల చైతన్య స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం 2వేల మందికి పై చిలుకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాదల చైతన్య మాట్లాడుతూ ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి నారా లోకేష్ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు.

అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాదల చైతన్య

మస్తాన్ సాదిక్ మృతదేహం

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ సాదిక్ మృతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని రామాపురం గ్రామంలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పని చేస్తున్న మస్తాన్ సాదిక్(28) మృతి చెందారు. సాదిక్ సంవత్సరం పైగా అక్కడ పని చేస్తున్నారు. మేడికొండూరు గ్రామం నుంచి రోజూ రామాపురం వచ్చి విధులు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో రామాపురం గ్రామ శివారులో గురువారం అతని మృతదేహం కనిపించింది. గ్రామస్తులందరూ విషాదాన్ని తెలియజేశారు. అందరితో సౌమ్యంగా ఉండే షాదిక్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వెనక్కు నడిచి నిరసన.. 64 రోజులకు ఆందోళన..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మిక సమస్యలపై అనేక పోరాటాలు చేసిన సిఐటియు ఎన్నో విజయాలు సాధించిందని, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసమూ అదేవిధంగా ఉద్యమిస్తుందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. పనుల నుండి నిలిపేయబడిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రెండు నెలలకుపైగా

చేపట్టిన ఆందోళన గురువారం 64వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు వెనక్కు నడిచి వినూత్న నిరసన తెలిపారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ వర్షాలను, ఈదురు గాలులను సైతం తట్టుకుని కార్మికులు పట్టుదలగా పోరాడుతున్నారని చెప్పారు. రెక్కల కష్టం చేస్తూ పరిశుభ్రతకు పాడుపడే వీరిపట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే అరవిందబాబు, మున్సిపల్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

వినుకొండలో 31న మెగా జాబ్‌మేళా

ఎంపికలు చేపట్టనున్న 25 కంపెనీలు - పోస్టర్‌ను ఆవిష్కరించిన జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

నిరుద్యోగ యువత కోసం ఈ నెల 31న వినుకొండలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పననే మొదటి ప్రాధాన్యంగా తీసుకున్నామని చెప్పారు. ఈ మేరకు పోస్టర్‌ను జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ఉద్యోగ మేళాలో 25 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చేసిన నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9951214919, 9100566581, 7702921219 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. ఐటీ, ఫైనాన్స్, మ్యానుఫ్యాక్చర్, సాఫ్ట్‌వేర్, రిటైల్ రంగాలు చెందిన కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. టెక్ మహీంద్రా, డైకిన్, అప్స్‌టెక్ సొల్యూషన్స్, అమర్‌రాజా, ముత్తూట్ ఫైనాన్స్, హీరో మోటో కార్ప్, హెటిరో, అపెక్స్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్, ఎస్‌బీఐ కార్డు సహా 25 కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. అర్హత బట్టి కంపెనీలు జీత భత్యాలు చెల్లిస్తాయన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన ఫ్రెషర్స్‌ని కూడా నియమించుకుని శిక్షణ ఇస్తారని, జాబ్‌మేళా ఉదయం 9 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, జానీ, బత్తుల గోవిందరాజులు, నర్రా కిషోర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల కోసం ధరఖాస్తు చేసుకోండి : తహశీల్దార్

ఒకటి నుండి రేషన్ షాపుల ద్వారానే సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

మాచర్ల పట్టణ, మండల పరిధిలో రేషన్ కార్డులు లేని వారు నూతన రేషన్ కార్డుల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ కిరణ్‌కుమార్ కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నూతన రైస్‌కార్డు పొందాలన్నా, రైస్ కార్డులో పేరు మార్చుకోవాలన్నా, హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. రేషన్‌కార్డులో తప్పుగా ఆధార్ సీడింగ్ జరిగితే సవరణ కోసం, కార్డు వద్దనుకుంటే కార్డు తొలగింపునకు, కుటుంబ విభజనలో భాగంగా నూతన రైస్ కార్డు మంజూరు కోసం, కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను కార్డులో నమోదు చేసుకోవటానికి, కుటుంబ సభ్యుల పేర్లను తొలగింపుకు, కార్డు లేని వారు నూతన రేషన్ కార్డుల కోసం వచ్చేనెల 7వ తేదీలోపు ధరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఒకటో తేదీ నుండి నిత్యావసర సరకుల పంపిణీ రేషన్ షాపుల వద్ద ఉంటుందని, ఈ విషయాన్ని రేషన్ కార్డుదారులు గమనించాలని, రేషన్ షాపులకెళ్లి సరుకులు తీసుకోవాలని కోరారు.

కరతాళ ధ్వనుల మధ్య ముగిసిన నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు గన్నమనేని వెంకయ్య కళ ప్రాంగణంలో మూడ్రోజుల పాటు నిర్వహించిన నందమూరి తారక రామారావు కళాపరిషత్ నాటకోత్సవాల ప్రేక్షకుల కరతాళ ధ్వనులు, అతిథుల ప్రశంసలతో బుధవారం సందడి వాతావరణంలో ముగిశాయి. చివరిరోజు ప్రదర్శనలకు ముందు చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు భార్య లీలావతి పాల్గొని కళాకారులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలు తిలకించేందుకు వచ్చిన మహిళలకు 32 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి చీరల పంపిణీ చేశారు. కళాకారులకు పెనుగొండ శ్రీనివాసరావు, గంగినేని రాఘవరావు, వాసిరెడ్డి లింగమూర్తి నగదు పురస్కారాలు సమకూర్చారు. నాటిక ప్రదర్శనలకు సహకరించిన వారిని నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, న్యాయవాది రామకోటేశ్వరరావు, బొల్లా వెంకట కోటయ్య ఆధ్వర్యంలో సత్కరించారు.

స్వేచ్ఛ పేరుతో స్త్రీ పురుషులు హద్దు మీరితే పచ్చటి కాపురాలు పూలుతాయి గాలిపటానికి సైతం దారం ఆధారం కావాలి అది లేకపోతే ఎక్కడో చిక్కుకొని చిరిగిపోతుంది అనే ఇతివృత్తంతో భార్యాభర్తల మధ్య ఉండాల్సిన బంధాన్ని రచయిత పరమత్తుమని శివరాం 'స్వేచ్ఛ' నాటికను మలిచారు. బిఎం రెడ్డి దర్శకత్వంలో హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించి తమ నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు. అల్జీమర్స్‌తో బాధపడుతున్న తండ్రిని ఒంటరిగా వదిలేసి వెళ్లలేక జీవితాన్ని త్యాగం చేసిన కూతురి కథే 'దేవరాగం' ఉత్తరాంధ్ర వారి సౌజన్య కళా స్రవంతి కళాకారులు పోటీపడి నటించగా కేకేఎల్ స్వామి రచించి దర్శకత్వం వహించారు. చివరిగా 'దొందు దొందే' హాస్య నాటికను భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం కళాకారులు పరదర్శించే సమయానికి వర్షం రావడంతో ప్రదర్శన నిలిపివేశారు. లగడపాటి వెంకట్రావు, మంద మరియాబాబు, గాలి రేవతి శ్రీనివాసరావు, పెనుగొండ శ్రీనివాసరావు, లాయర్ సైదారావు, కౌన్సిలర్ దస్తగిరి షకీలా, పీవీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సేద్యపు కుంటలను పరిశీలిస్తున్న పీడీ సిద్దాలింగమూర్తి

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై ప్రత్యేక దృష్టి : డ్వామా పీడీ

ప్రజాశక్తి-ఈపూరు

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డ్వామా పీడీ సిద్ధా లింగమూర్తి అన్నారు. మండలంలోని గోపువారిపాలెం, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో సేద్యపు కుంటలను ఆయన గురువారం పరిశీలించారు. జిల్లాలో 1118 సేద్యపు కుంటలు లక్ష్యం కాగా 494 నిర్మించారని, 5300 ఇంకుడు గుంతలు తీయాల్సి ఉండగా 2729 తీశారని, ఎరువులు తయారు చేసే కంపోస్టు పిట్‌లు 18230 లక్ష్యం కాగా 64 నిర్మించారని వివరించారు. ఉపాధి కూలీల నమోదులో అక్రమాలకు పాల్పడే సిబ్బందిని తొలగించటంతో పాటు రికవరీ చేస్తామన్నారు. గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనుల్లో ఎక్కువ మంది పాల్గొనేలా సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. పరిశీలనలో ఎంపిడిఓ కె.ప్రభాకరరావు, ఎపిఓ పుష్పరాజ్, టిఎ రోజా పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తూ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు ఇతర అధికారులు

అన్న క్యాంటీన్‌లో కలెక్టర్, ఎస్పీ భోజనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అన్న క్యాంటీన్‌లో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని బస్టాండ్ సమీపంలో గల అన్నా క్యాంటీన్‌ను ఎస్పీ కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్‌తో కలిసి కలెక్టర్ గురువారం సందర్శించారు. అన్న క్యాంటీన్లోని భోజనాన్ని వారు తినడంతోపాటు అన్నం తినడానికి వచ్చిన ఇతరులతోనూ మాట్లాడారు. క్యాంటీన్‌లో వసతుల, ఆహారం నాణ్యత, రుచిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

1న తెలుగు రాష్ట్రాల స్థాయిలో సినీ పాటల పోటీలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకొని వచ్చేనెల ఒకటో తేదీన ఎస్పీ బాలసుబ్రమణ్యం కళా పరిషత్ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణం మానుకొండ కళ్యాణమండపంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి తెలుగు సినిమా పాటల పోటీల 'స్వరనీరాజనం'ను డాక్టర్ ముటుకుల కమలాసన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఎస్పీ బాలు పేరుతో కళాపరిషత్ ఏర్పాటు అభినందనీయమన్నారు. కళా పరిషత్ పేరుతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళా పరిషత్ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ పులుసు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు బాహాటం శేషగిరిరాజు, గట్ల కోటిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనికుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - అచ్చంపేట

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సైనికుడు చల్లా కోటేశ్వరరావు (సీకే రావు) కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు ప్రేమ్‌రాజు, మాజీ సైనికుడు రాష్ట్ర వడ్డెర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు ప్రసాద్, బీసీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దేవళ్ల మల్లికార్జునరావు, నంబూరు గ్రామ ఎంపీటీసీ షేక్ లతీఫ్ బుధవారం పరామర్శించారు. సీకే రావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లపు ప్రసాద్ మాట్లాడుతూ సీకే రావు ఎయిర్ ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తుండగా, తాను నేవీలోలో విధులు నిర్వహించానని చెప్పారు. ఆ సందర్భాల్లో ఖాళీ సమయాల్లో గ్రామాల్లోని అభివృద్ధికి మిగిలిన జీవితం ఉపయోగపడాలని సీకే రావు చెబుతుండేవారని గుర్తు చేశారు. సీకే రావు కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని చెప్పారు. సీకే రావు భార్య అనుపకళ, కుమారుడు ఋషికి ధైర్యం చెప్పారు.

వికసించిన మే పుష్పం

సుధాకర్ పెరట్లో వికసించిన మే పుష్పం, పువ్వు పూసే క్రమంలో తన దశను మార్చుకుని ఆకులను రాల్చుకున్న దృశ్యం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రతి ఏడాది మే మాసంలో వికసించే అరుదైన "మే పుష్పం" తన అందాన్ని విరజిమ్ముతూ తెనాలిలో దర్శనమిచ్చింది. తెనాలి వివిఎస్‌ఆర్ కళాశాల సమీపంలో నివసిస్తున్న మత్స్యశాఖ రిటైర్డ్ సీనియర్ డైరెక్టర్ తోట సుధాకర్ గృహ ఆవరణలో పుష్పం వికసించి చూపరులను ఆకట్టుకుంటుంది. పుట్ బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ (శాస్త్రీయ నామం స్కాడోక్సస్ మల్టిఫ్లోరస్)గా పిలవబడే మే పుష్పం చూడ్డానికి ఎర్రని బంతిలా ఆకట్టుకొనేవిధంగా ఉంటుంది. ఎండలు విపరీతంగా ఉన్నప్పుడు అంటే ఏప్రిల్, మే నెలల్లో వికశిస్తుంది కనుక దీనిని మనదేశంలో మే పుష్పం అంటారు. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప రకం మొక్క. ఒక్క సారి నేలలో పాతిపెడితే చచ్చిపోవడం అంటూ ఉండదని ఉద్యానవన శాఖ అధికారులు చెప్తారు. ఎప్పటికప్పుడు నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఎంత వేడిగా ఉంటే అంతగా ఇది పూలతో వికసిస్తుంది. మొగ్గ పువ్వుగా విచ్చుకోవడానికి సుమారు ఇరవై రోజులు పడుతుంది. ఒకటిన్నర నుంచి రెండడుగుల ఎత్తు ఉండే ఈ మొక్క తక్కిన కాలం అంతా పచ్చని వెడల్పాటి ఆకులతో అలరిస్తుంది. కాకపోతే ఒక దుంపకి ఒక పువ్వే పూస్తుంది. ఎక్కువ పూలు కావాలంటే అన్ని దుంపలు నాటుకోవాల్సిందే. దీనికుండే మరో ప్రత్యేకత దుంపలు ఎంత పురాతనమైతే పువ్వు పరిమాణం అంతగా పెరుగుతూ వస్తుంది. అంటే మొదటి ఏడాది చిన్న బంతిలా పూస్తే రెండు మూడేళ్ల తర్వాత పెద్ద పెద్ద పూలతో వికసిస్తుంది. ఏటికేడాది దీని పరిమాణం పెరుగుతుంది. ఇసుక నేలల్లో బాగా పెరుగుతుంది. పువ్వు వికశించే ముందు తన దశను మార్చుకుని తనకున్న వెడల్పాటి ఆకులను రాల్చుకుంటుంది. 18 ఏళ్లక్రితం తాను తెలంగాణలో ఉద్యోగం చేస్తున్నప్పుడు మే పుష్పం దుంపను తెచ్చి నాటినట్లు సుధాకర్ చెప్పారు. తమ పెరట్లో వికసించిన మే పుష్పాన్ని ఇప్పటివరకూ ఏ పత్రిక ప్రచురించలేదని తొలిసారి ప్రజాశక్తి విలేకరి తాను ప్రచురిస్తానడం ఆనందంగా ఉందన్నార

నీటి వనరులను సందర్శించిన మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆంధ్రప్రదేశ్‌లోని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్, అమృత్ మిత్ర కార్యక్రమం కింద ఉమెన్ ఫర్ ట్రీస్ చొరవలో భాగంగా నీటి వనరులను గురువారం సందర్శించారు. ఆయనతో పాటు స్వయం సహాయక బృందం (ఎస్‌హెచ్‌జి) సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మరియు ఇతర ముఖ్య భాగస్వాములు కూడా ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా, మిషన్ డైరెక్టర్ సమావేశమైన ఎస్‌హెచ్‌జి సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉమెన్ ఫర్ ట్రీస్ ప్రచారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పట్టణ పచ్చదనం, వాతావరణ ప్రాముక్యత మరియు సమాజం నేతృత్వంలోని పర్యావరణ స్థిరత్వంలో దాని పాత్రను ముఖ్యఉదేశాలను వివరించారు. ఈ రోజు కాజ గ్రామములో అమృత మిత్ర 2.0 పథకము (NOGU women for Trees) చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి గౌరవ మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్, నగర పాలక సంస్థ కమీషనర్ అలీం భాషా, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ, టౌన్ ప్లానింగ్ ఇంజనీరు సెక్షన్ మరియు మెప్మా సిబ్బంది మరియు స్వయం సహాయక సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ప్రతి ఒక్క మహిళా ఒక మొక్క నాటి ఆ ప్రాంతం మొత్తం గ్రీవర్‌గా ఉండాలి అని మన ముఖ్య మంత్రిగారి యొక్క ఆ కాంక్ష ,వారి యొక్క ఆలోచన దిశగా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం లో భాగస్వామంగా చేస్తూ పర్యవరణ కాలుష్య రహిత వాతావరణాన్ని నిర్వహించాలనేది ప్రభుత్వ ఉద్దేశము.

కార్యక్రమంలో పాల్గొన్న తేజ్‌భరత్

ఈవీ ఛార్జింగ్ సొల్యూషన్‌లను ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్‌లో పరిశుభ్రమైన, పర్యావరణహిత ఇంధనాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి డాక్టర్ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. భవిష్యత్తు విద్యుత్ వాహనాల దేనని, వాటిని ప్రోత్సహించేందుకు సబ్సిడీలు, రాయితీల తో పాటుగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. విజయవాడ క్లబ్‌లో గురువారం ప్రముఖ విద్యుత్ వాహనాల ఉత్పత్తుల తయారీ సంస్థ డీజేటీ హైకా ఆధ్వర్యంలోని అధునాతన ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను మంత్రి డాక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశుభ్రమైన, స్థిరమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ఒక అద్భుతమైన అడుగు ఇది అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీజేటీ హైకా అభివృద్ధి చేసిన 60 కిలోవాట్ డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ మెషిన్, 240 కిలోవాట్ డీసీ అల్ట్రా-ఫాస్ట్ ఛార్జింగ్ మెషిన్, 3.3 కిలోవాట్, 7.4 కిలోవాట్ ఏసీ ఛార్జర్‌లను రాష్ట్రంలో ప్రారంభించడం ఒక గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు.

ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

భారత జాతి పునరుజ్జీవ పితామహుడు రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - గుంటూరు

రెండున్నర శతాబ్దాల క్రితం నాటి భారతదేశంలో వేళ్లూనుకున్న మూఢ నమ్మకాలు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన రాజారామ్మోహన్ రాయ్ భారత జాతి పునరుజ్జీవ పితామహుడని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి అన్నారు. బాలానంద కేంద్రం సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక భారత తొలి సంఘసంస్కర్త రాజారామ్మోహన్ రాయ్ 253వ జయంతిని బ్రాడీపేటలోని రాజా రామ్మోహన్ రాయ్ పాఠశాల ప్రార్థన సమాజం ఆవరణలో గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలానంద కేంద్రం కార్యదర్శి నడింపల్లి గురుదత్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ రాధాకఅష్ణమూర్తి మాట్లాడుతూ రామ్మోహన్ రాయ్ ఉన్నత విద్యావంతుడని, బహు భాషా కోవిదుడని, హిందూ, క్రైస్తవ, ముస్లిమ్ మత గ్రంథాలను ఔపోసన పట్టారని చెప్పారు. ఏకేశ్వరోపాసన స్థాపన కోసం 'బ్రహ్మ సమాజం' ఏర్పాటు చేశారన్నారు. ఆయన నిరంతర కృషితో సతీసహగమనాన్ని, బాల్యవివాహాలను అప్పటి బ్రిటిష్ ప్రధాని విలియం బెంటింగ్ ద్వారా చట్టబద్ధంగా నిరోధించారని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రామ్మోహన్ రాయ్ ఆధునిక భావాలతో, హేతువాద, శాస్త్రీయ భావజాలంలతో మూఢనమ్మకాలు, దురాచారాలకు వ్యతిరేకంగా పని చేశారన్నారు. బాలానంద కేంద్రం గౌరవాధ్యక్షులు ఆడిటర్ కేతరాజు నరసింహారావు మాట్లాడుతూ సంస్కరణ వాదులైన రఘుపతి వెంకయ్య నాయుడు, అప్పటి మున్సిపల్ చైర్మన్ నడింపల్లి లక్ష్మి నరసింహారావు చేతుల మీదుగా రాజారాం మోహన్ రాయ్ పేరున బ్రహ్మ సమాజం అనబడే ప్రార్థన సమాజం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలనంద కేంద్రం ఉపాధ్యక్షులు మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, కార్యవర్గ శ్రీనివాస రావు, పిఎస్ మూర్తి, కె.రామ్‌సుభాష్, మాజేటి విఎస్‌ఆర్ ప్రసాద్, బాలానంద కేంద్రం పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి వావిలాల రామ్ కుమార్ పాల్గొన్నారు.

రాజారామ్మోహన్‌రాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

పనులు పరిశీలనలో చైర్‌పర్సన్ రాధిక

పారిశుధ్య పనులు పరిశీలించిన చైర్పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలోని 8,10 వార్డులలో గురువారం చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చిన మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాల్సిందిగా కోరారు. చెత్తను కాలువల్లో వేయకుండా, ఇంటింటి చెత్త సేకర ణలో పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

170వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికు లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి170 రోజుకి చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటిస్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో ఎం. పిచ్చయ్య, కె.అగ్గయ్య, సాంబశివరావు, నవనీతం, ఇమాంబి, శారమ్మ కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఎం.సుబ్బారావు, సాంబయ్య, తుపాకుల నాగేశ్వరరావు, రమాదేవి, దుర్గాభవాని, ఇమాంబి, డి .నాగేశ్వరరావు, ఖాసీం, ఇస్మాయిల్, రమణమ్మ, వై.రమాదేవి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి

ప్రతి డ్వాక్రా మహిళ వ్యాపారవేత్త కావాలి

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతి డ్వాక్రా మహిళ వ్యాపారవేత్త కావాలని ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి అన్నారు. గురువారం పెదకాకాని గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వ్యాపార సంస్థలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ,గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరుణ వాకాటి ఆదేశాల మేరకు రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల అభివఅద్ధికి మరియు వారి కుటుంబ అవసరాలకు కావలసిన ఖర్చులను ప్రణాళికలను రూపొందించడం జరిగిందని అందులో భాగంగా ఈరోజు పెదకాకానిలో పలు మహిళా వ్యాపారవేత్తలు నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను పరిశీలించామన్నారు. మండల, గ్రామ స్థాయిలలో డ్వాక్రా వ్యాపారవేత్తలను గుర్తించి వారికి కావాల్సిన నిధులను బ్యాంకు లింకేజీ, శ్రీనిధి మరియు ఇతర శాఖల సమన్వయంతో అందించనున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్

లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - మాచర్ల

మండల న్యాయ సేవా కమిటీ మాచర్ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోర్టు ఆవరణలో పానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు లైంగిక వేధింపుల చట్టం 2013 పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ మాట్లాడుతూ పనిచేసే ప్రాంతాలలో వేధింపులకు గురయ్యే మహిళలకు లైంగిక వేధింపుల చట్టం 2013 రక్షణ కల్పిస్తుందని, ఎవరైనా మహిళలు వేధింపులకు గురైనట్లయితే సంబంధిత శాఖాధిపతులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. వేధింపులకు గురైన మహిళలకు న్యాయం జరగనట్లయితే మండల న్యాయ సేవ కమిటీని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు, గౌస్ భాషా, ప్యానల్ న్యాయవాదులు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానాలు

ప్రజాశక్తి-మాచర్ల

హనుమంతు జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో గుంటుపల్లి వెంకట గాంధి సహకారంతో అన్నదానం నిర్వహించారు. రైల్వే స్టేషన్ బజారు రామాలయంలో దేవస్థాన కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కెసిపి సిమెంట్స్ జనరల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు. ఆయా దేవాలయాల్లో చేపట్టిన అన్నదాన కార్యాక్రమాల్లో పెద్ద ఎత్తున పేద ప్రజలు, భక్తులు పాల్గొని కడుపునిండుగా భోజనం చేశారు. సుమారు ఏడు వేల మందికి అన్నదానం చేశారు.

మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే జూలకంటి, తోట వీరాంజనేయులు

రాజకీయ కక్షసాధింపు, అశాంతి ఉంటే అభివృద్ధి జరగదు

ప్రజాశక్తి - మాచర్ల

ఫ్యాక్షన్ తగదాలో మరణించిన దేశం పార్టీ నాయకుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి తమ ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపులుండవని, అశాంతికి అవకాశం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంఎల్ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి రుజువు చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామానికి చెందిన తోట చంద్రయ్యను ప్రత్యర్థులు కిరాతకంగా హత్య చేశారు. పార్టీని నమ్ముకుని హత్యకు గురైన చంద్రయ్య కుటుంబం పడే ఆవేదనకు పార్టీ అండగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఎపి మంత్రివర్గ సమావేశంలో తొట చంద్రయ్య కుమారుడు వీరాంజనేయులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ తీర్మానం చేశారు. అశాంతి ఉన్న దగ్గర అభివృద్ధి జరగదని నమ్మిన చంద్రబాబు బాటలోనే మాచర్ల ఎంఎల్ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృషి చేస్తున్నారు. తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, మంత్రి నారా లోకేష్‌కు, మంత్రి వర్గానికి, ఎంఎల్ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డికి తొట వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

యోగా శిక్షణ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్ద చెరువులోని కలెక్టర్ బంగ్లా వద్ద నుండి పల్నాడు బస్టాండ్ రోడ్డు వరకు రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగ పై వచ్చే నెల 21 వరకు శిక్షణను ఇవ్వనున్న నేపథ్యంలో సదరు స్థలాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గురువారం ఎస్.పి కె శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. యోగ నిర్వహించే సమయంలో వాహనాల రాకపోకలను వేరే దారికి మళ్ళించాలని ఆయన సూచించారు. యోగాలో పాల్గొనే వారికి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె ధనుంజయ్, ఆర్డీఓ కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తహశీల్దార్ కె. వేణుగోపాలరావు పాల్గొన్నారు.

యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ వచ్చే నెల 21 వరకు యోగా ప్రాముఖ్యతను ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులకు ఆయా రంగాల వారికి పోటీలను నిర్వహించాలని కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి

స్థలాన్ని పరిశీలన చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో యోగా శిక్షకులను గుర్తించి అభ్యాస కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో యోగా అభ్యాసాలకు ప్రజలను నమోదు చేసేందుకు కషి చేయాలన్నారు. యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని, అదే విధంగా ప్రశాంతత, ఆధ్యాత్మికచింతన వద్ధిచెందుతాయన్నారు. యోగా డే లో పాల్గొనే వారి పేర్లు నమోదు చేసుకునేందుకు రూపొందించిన యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కేంద్రం నరసరావు పేటతో పాటు మున్సిపాలిటీలలో మండల స్థాయిలో యోగా ప్రాముఖ్యతను తెలియజేయాలని జిల్లాలో పర్యాటక ప్రాంతాలలో యోగా ప్రాముఖ్యతపై కార్యక్రమాలు నిర్వహించాలని పర్యాటకశాఖ అధికారులను, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

పేద, అనాథ విద్యార్థుల చదువుకు దాతలు సహకరించాలి

కమ్మ బాలికల వసతి గృహంలో ఆత్మీయ సమావేశంలో ఎబి వెంకటేశ్వరరావు

కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్య ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగు నింపుతుందని తద్వారా వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందనీ, పేద, అనాథ విద్యార్థుల చదువుకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఇంటిలిజెన్స్ విశ్రాంత ఐజి ఏబి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం నరసరావు పేట పట్టణం ఎన్‌జిఓ కాలనీలోని కాకతీయ కమ్మ బాలికల వసతి గృహంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసరావుపేట విచ్చేసిన ఆయనకు పట్టణ ప్రముఖులు డాక్టర్ గడ్డం హరిబాబు, టిడిపి నేత వాసిరెడ్డి రవి, ఎంఎఎం కళాశాలల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, కోటప్పకొండ కమ్మ సత్రం కమిటీ సభ్యులు అనుమోలు వెంకయ్య చౌదరి కె.వి.ప్రసాద్ స్వాగతం పలికారు. వసతి గృహంలోని విద్యార్థినిలను ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఉద్దేశించి విశ్రాంత ఐజి మాట్లాడుతూ మెరుగైన వసతి, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు చేయూత నివ్వాలని అనాథ, పేద విద్యార్థినిల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలో మహిళలు పురుషులకు ధీటుగా రాణిస్తున్నారన్నారు. ఆడపిల్ల ఇంటికి దీపం అనే నానుడిని నిజం చేయడమే కాకుండా నేడు మహిళలు ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ ఇలా అన్ని రంగాలలో రాణిస్తూ సమాజానికి వెలుగులు నింపుతున్నారన్నారు. కమ్మ సామాజిక వర్గంలో అనేక మంది పేదరికంలో ఉన్నారని ఆయా కుటుంబాలలోని పేద, అనాథ విద్యార్థులకు వసతి గృహాలలో అవకాశాలు కల్పించి ఆదరించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలకు తప్పనిసరిగా కమిటీలు ఉండాలని ఆయా కమిటీలు శ్రద్ధ వహించాలన్నారు. వసతి గృహం అభివృద్ధికి తీసు కోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు పెద్దలతో చర్చించారు.

వ్యాపార, వాణిజ్య వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం

ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కూటమిప్రభుత్వంలో వాణిజ్య, వ్యా పార వర్గాలవారు ఎలాంటి ఆందోళ న, భయం లేకుండా ప్రశాంతంగా త మ కార్యకలాపాలు సాగించుకునే స్నేహపూర్వక సత్సంబంధాలు ఉ న్నాయని, గతంలో మాదిరి వేధిం పులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు స్థానం లేదని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం జరిగిన చిలకలూరి పేట నియోజకవర్గ ఛాంబర్ ఆఫ్ కా మర్స్ నూతనకార్యవర్గ ప్రమాణ స్వీ కారోత్సవంలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు, కొత్తమసు శ్రీనివాసరావు, అరెకట్ల కోటే శ్వరరావు, కొప్పురావూరి రాధాకృష్ణ, సభ్యులతో ప్రత్తిపాటి ప్రమాణం చేయించిన అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు. చిలకలూరిపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో అన్నివర్గాల వారు ఉన్నారని, కూటమి ప్రభుత్వంలో వ్యాపారులకు అవ సరమైన అన్ని సహాయసహకారాలు అందుతాయన్నారు. వ్యాపారులు ఎలాంటి అభద్రతాభావానికి లోను కాకుండా తమ పనులు చేసుకోవచ్చున్నారు. వ్యాపారులు కష్టపడి పని చేసుకోవడంతో పాటు, తమ సంపా దనలో కొంత భాగాన్ని ప్రజాసేవకు వెచ్చించాలని, వివిధ మార్గాల్లో పది మందికి సాయపడేలా కార్యక్రమాలు

నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు

నిర్వహించాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగిన మంచి రోడ్డు, రవాణా సౌకర్యం భూమి, నీటి వసతులు లాంటివి అనుకూలతగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, కందుల రమణ, వక్కలగడ్డ భాస్కర్ రావు, యేల్చూరి వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి రవి శంకర్, కనమర్లపూడి రమేష్, మురకొండ మల్లిబాబు, గట్టినేని రమేష్, తుబాటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దేవాయలంలో అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

హనుమజ్జయంతిసందరర్భాన్నిప్ురస్కరించుకుని వినుకొండ పట్టణం ప్రసిద్ధ శ్రీగుంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఆయన భార్య లీలావతి ప్రారంభించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, స్థానిక నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపోలో గురువారం డైలీ యువర్ డిఎం కార్యక్రమం జరుగును అని డిపో మేనేజర్ కోటేశ్వర నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడును అని ప్రయాణికులు, గ్రామస్తులు ఏమైనా ఫిర్యాదులను తెలపవొచ్చుననీ, సలహాలు, సూచనలు అందించవచ్చునని తెలిపారు. ఫోన్ చేయవల సిన వారు 9959225430 నెంబర్‌కు చేయాలని సూచించారు.

అన్న వితరణ ఒక వరం

ప్రజాశక్తి - పెదకూరపాడు

అన్న వితరణ ఒక వరమని,ఆకలితో ఉన్నవారికి ఆస్తులు, అంతస్తులు, డబ్బులు అక్కర్లేదని పట్టెడన్నం పెడితే అదే గొప్ప పుణ్యకార్యమని హిందీ సేవా సదన్ ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కోఆర్డినేటర్ సయ్యద్ అక్బర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో అభయాంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భోజనాన్ని జన చైతన్య సమితి ప్రతినిధుల దృష్టికి కొర్లకుంట శ్రీనివాసరావు తీసుకెళ్లారు. వారు భోజనాన్ని పెదకూర పాడు మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జన చైతన్య సమితి ప్రతినిధి అన్నవరపు స్టాలిన్ బాబు మాట్లాడుతూ ఏ ఫంక్షన్లలో నైనా ఆహారం మిగిలిపోతే తమకు సమాచారం ఇస్తే ఆ ఆహారాన్ని తీసుకు వెళ్లి లేనివారికి పెడతామని అన్నారు. కార్యక్రమంలో గుడిపూడి అఖిల్,అన్నవరపు సిద్ధు, గంధం వీర్లంక, సయ్యద్ ఖాదర్బాషా పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సంధ్యారాణి

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నిబం ధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు అర్బన్ ఎస్.ఐ సంధ్యారాణి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. మద్యం త్రాగి వాహనాలు నడిపినా, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు అన్ని పత్రాలు దగ్గర పెట్టుకుని వాహనాలు నడపాలని పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

బస్ డిపో ప్రాంగణంలో స్థలాలకు టెండర్లు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలాలకు టెండర్ పద్ధతిలో లీజులు ఇచ్చేందుకు ఈనెల 29వ తేదీ నుండి టెండర్లు తీసుకోబడునని డిపో మేనేజర్ కోటేశ్వరావు నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని ప్రధాన బస్టాండ్ నందు గల 2178 చదరపు గజాలు అలాగే దాచేపల్లి బస్టాండ్ లోని 7357 చదరపు గజాలు ఖాళీ స్థలాన్ని 15 సంవత్సరాల పాటు చట్టపరమైన వ్యాపారములు చేసుకొనుటకు అద్దె ప్రాతిపదికన టెండర్ పిలవబడుతుందని తెలిపారు. టెండర్ ఫారాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వారి కార్యాలయం నెల్లూరు జూన్ 3లో దాఖలు చేయాలని 29వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల వరకు టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని 29వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఔత్సాహకులు, పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు.

వేలాడుతోన్న నిఘా నేత్రం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు:
గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు,ఈదురు గాలుల వలన చెట్లు స్తంభాలు ఇల్లు పడి పోయాయి అయితే ప్రత్తిపాడు నియోజక వర్గం లోని వట్టిచెరుకూరు మండల పరిధి లోని పాత మద్రాసు రోడ్డు లోని ఐదో మైలు వద్ద ఏర్పాటు చేసిన చేసిన నిఘా నేత్రాలు ఒకటి తీగలపై ఆధారపడి వేలాడుతూ కనిపించింది.అయితే ఆ రహదారి లో మూడు రోడ్ల కూడలి అందులోనూ రద్దీ గా ఉంటుంది మరియు అక్కడ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటాయి కావున సరి చేసి నిఘా నేత్రం సరి చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.


ఐదవ మైలు వద్ద వేలాడుతున్న నిఘా నేత్రం

పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న సంగం సభ్యులు

"చలో విజయవాడ" జయప్రదం చేయండి

ప్రజాశక్తి- తాడేపల్లి
జూన్ 5వ తేదీన రాష్ట్ర ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్బాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మంగళగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు మురళి, కార్యదర్శి మాధవరావు, ఉపాధ్యక్షులు సుభాషిణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కర్మాగారంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దాగుడుమూతలు ఆపాలి...

ప్రజాశక్తి - పొన్నూరు
ఆంధ్రుల ఆత్మగౌరవ సంపద అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న దాగుడుమూతల ఆటలు ఆపి, సంస్థలో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందే దిలీప్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, సంస్థలోని ఉద్యోగుల పట్ల యాజమాన్య వైఖరిని నిరసిస్తూ గత కొద్దినెలలుగా అక్కడి ఉద్యోగులు చేస్తున్న నిరవధిక నిరసన దీక్షలను బుట్టదాఖలుయ్యాన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలైన టిడిపి, వైసిపి మరియు జనసేనలలో చిత్తశుద్ధి లేకపోవటం, వారి రాజకీయ ప్రయోజనాలకై వెంపర్లాడటంతో విశాఖ ఉక్కుపై కేంద్రం మొండిగా ప్రజా మరియు కార్మిక సంఘాల శ్రేయస్సుకు బిన్నంగా వ్యవహరిస్తుందని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఈ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ప్లాంట్ పరిరక్షణ కు గురువారం నుంచి ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి నిరసన మొదలపెట్టబోతున్నారని, సంస్థలో పనిచేస్తున్న మూడు వేలకుపైగా కార్మికులను రాత్రికి రాత్రే తొలగించటం అనైతికం మరియు అప్రజాస్వామికం అని, ఈరోజు నుంచి కాంగ్రెస్ తలపెట్టిన ఆమరణ దీక్షకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతుందని అన్నారు.

యోగా శిక్షణకు ట్రైనర్లను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - గుంటూరు
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 కార్యక్రమాల్లో పాల్గనే ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు ట్రైనర్లను సిద్ధం చేయాలని మాస్టర్ ట్రైనీలకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. నగరంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం అమలుపై ఆసక్తి ఉన్న యోగా మాస్టర్ ట్రైనీలతో కమిషనర్ చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుండి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో గుంటూరు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. వారికి వార్డుల వారీగా జిఎంసి ఏర్పాటు చేసే శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్లు అవసరమని, అందుకు తగిన విధంగా వారిని మాస్టర్ ట్రైనీలు తమ దగ్గర యోగా శిక్షణ ఇచ్చే వారి వివరాలను తమకు అందించాలని కోరారు. సమావేశంలో యోగా మాస్టర్ ట్రైనీలు వై.అంకమ్మరావు, పి.ప్రసాద్, వి.అంకినీడు ప్రసాద్, జి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

ఏపీజీఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

సమావేశాలకు హాజరుకావాలని ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి - కొల్లిపర
జూన్ 5వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రకౌన్సిల్ సమావేశానికి ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ హాజరుకావాలని దుగ్గిరాలయూనిట్ అధ్యక్షులు అందే బాలచంద్రమౌళి కోరారు. గురువారం కొల్లిపర తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ రిజిస్ట్రేషన్ సిబ్బందిని రాష్ట్ర కౌన్సిల్ సమావేశమునకు ఆహ్వానించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు గుంటూరుపూర్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులుషేక్ మీరావలి, జాయింట్ సెక్రెటరీ నూకవరపుశ్రీలక్ష్మీ కుమారి, కార్యవర్గసభ్యులు తహశీల్దార్ గుమ్మడిసిద్ధార్థ ఎంపీడీవో వీరమాచనేనివిజయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్. ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీతహసీల్దార్ రాజేష్ ఇఓపిఆర్డి సిహెచ్.భార్గవ్ పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎం.శ్రీలక్ష్మి కుమారి, ఫిజికల్ డైరెక్టర్స్ సూర్యప్రకాష్, దేవదాస్, వీఆర్వోలు భాస్కర్, సుష్మ, ప్రసాద్ సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి- తాడేపల్లి
గుంటూరు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు స్థానిక మారుతీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నులకపేట, ఉండవల్లి సెంటర్లలో హెచ్ఐవి ఎయిడ్స్ పై వీధినాటికల్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి శాంతకుమారి మాట్లాడుతూ విచ్చలవిడి శఅంగారం ద్వారా హెచ్ఐవి ఇలాంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని చెప్పారు. ఈ వ్యాధి పేరుని పడకుండా అటువంటి వాటికి దూరంగా ఉండటమే మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్టి రాఘవేంద్ర, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పి గంగాభవాని, ఏఎన్ఎం ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారుల మన్ననలను పొందుతున్న ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్

ప్రజాశక్తి - మంగళగిరి
ఖాతాదారుల మన్ననలను పొందుతూ సామాన్యుల బ్యాంకుగా 110 సంవత్సరాల నుండి సామాన్య పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ తన సేవలను కొనసాగిస్తూ లాభాల బాటలో పయనిస్తుందని బ్యాంక్ డైరెక్టర్ జె.వి.సత్యనారాయణ మూర్తి అన్నారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ సభ్యుల మహాసభ స్థానిక అంజుమన్ ఈద్గా కమ్యూనిటీ హాలులో గురువారం జరిగింది. ఈ మహాసభకు బ్యాంక్ డైరెక్టర్ పీవీ వెంకటరమణరావు అధ్యక్షత వహించారు. జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఖాతాదారుల మన్ననలను పొందుతూ సామాన్యుల పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సేవలు కొనసాగిస్తుందని ఆయన అన్నారు. సహకార వ్యవస్థలో సభ్యుల సర్వ పదములు అనే సైదాంతిక విశ్వాసంతో మన బ్యాంక్ సభ్యులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఆయన అన్నారు. దేశ పురోభివృద్ధిలో సహకార బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తున్నాయని అటువంటి బ్యాంకుల పట్ల భారత రిజర్వా బ్యాంక్ నిబంధనల పేరుతో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఈ ఆంక్షలు ఫలితంగా సహకార బ్యాంకులో నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంది అని తెలిపారు. జాతీయ బ్యాంకులతో సమానంగా సహకార బ్యాంకులు చూడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి వాటిని తిరిగి సామాన్య ప్రజలకు రుణాల రూపంలో అందజేసి వాటి ద్వారా వచ్చే లాభాలను తిరిగి ఎటువంటి లాభాపేక్ష లేకుండా సభ్యులకే పంచుకున్న ఘనత ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకుకే దక్కుతుందని చెప్పారు. ఖాతాదారుల పిల్లలకు వివిధ ప్రవేశ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు నగదు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, చిరు వ్యాపారులకు స్వయం ఉపాధి పొందుతున్న వారికి విద్యా వైద్యా సమస్యల అభివఅద్ధికి, వఅత్తి కారులకు వివిధ రకాల రుణాలను అందిస్తూ ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ తోడ్పాటును అందిస్తుందని కోటేశ్వరరావు అన్నారు. షణ్ముఖ ప్రియా బ్యాంకు డైరెక్టర్ జెవి సత్యనారాయణమూర్తి బహుమతి ప్రధానం చేశారు.ఈ సమావేశంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ నన్నపనేని అంజయ్య, జోనల్ మేనేజర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, మంగళగిరి బ్రాంచ్ కమిటీ సభ్యులు బత్తూరి మోహనరావు, వెంకటస్వామి, బ్రాంచ్ సభ్యులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తుల గిరి, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి

బండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి
టీడీపీ నాయకులు ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్ తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ స్ఫూర్తితో ఐదు మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారథి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు చేతుల మీదగా చిరు వ్యాపారులకు బండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు కర్రేటి సురేష్ బాబు, గడవర్తి నాగేశ్వరరావు, సురేష్ బాబు, రాంబాబు, తాడిబోయిన గోపి కృష్ణ, బట్టు రామకఅష్ణ, తన్నీరు తరుణ్ తదితరుల తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన నాయకులు నాగరాజు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్
కుంచనపల్లి గ్రామానికి చెందిన జనసేన గ్రామ ఉపాధ్యక్షులు మారుమాక నాగరాజు (42) గురువారం తెల్లవారుజామున గుంటూరులోని గవర్నమెంట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజు మృతి వార్త తెలుసుకున్న జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు మేకల రాజా, నాయకులు బొడ్డు మహేంద్ర, కొవ్వూరు సురేష్ తదితరులు నాగరాజు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మట్టి ఖర్చులు నిమిత్తం కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలను నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగరాజు మృతి గ్రామ పార్టీకి తీరని లోటని అన్నారు.

2న కుట్టు శిక్షణ బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి -పెదనందిపాడు
ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) వారి సహకారంతో తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ 4వ బ్యాచ్‌ని జూన్ 2వ తేదీ ఉదయం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో మాజీ శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రారంభిస్తారని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు తెలిపారు. శిక్షణకు హాజరు కావాలనుకునే వారు జూన్ 1వ తేదీ లోపుగా వెయ్యి రూపాయలు ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని రమేష్ బాబు తెలిపారు. మూడు నెలలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ అనంతరం సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.శిక్షణ కాలంలో జిగ్ జాగ్ మిషను నేర్పడం జరుగుతుందన్నారు.లక్ష్మణరావు గారితో పాటు గుంటూరు జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టు కన్వీనర్ పాశం రామారావు, స్థానిక ప్రముఖులు పాల్గొంటారన్నారు.

నేడు పొన్నూరులో మినీ మహానాడు

ప్రజాశక్తి - చేబ్రోలు
నేడు పొన్నూరు నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు మండలంలోని చింతలపూడి గ్రామంలోని డివిసి కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ముఖ్య అతిధులుగా పాల్గొంటారని వివరించారు.

నేడు ప్రిఫరెన్షియల్, స్పెషల్ కేటగిరీ ఉపాధ్యాయులకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రిఫరెన్షియల్, స్పెషల్ కేటగిరీ ఉపాధ్యాయులకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో నేడు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరానికి గత నెల 24 నుండి 26 వరకూ నిర్వహించిన శిబిరం తర్వాత వివిధ రకాల వ్యాధులైన ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఎముకల క్షయవ్యాధి, న్యూరో సర్జరీ, కేన్సర్ తదితర వ్యాధులకు గురైన వారు, ప్రస్తుతం హేతుబద్దీకరణకు గురైన వారు మాత్రమే అర్హులని తెలియజేశారు. గత నెలలో క్యాంప్‌లో పాల్గొని సర్టిఫికెట్ పొందిన వారు ప్రస్తుత క్యాంప్‌లో పాల్గొనటానికి అర్హులు కాదన్నారు. అలా పాల్గొంటే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయన్నారు. కావున ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్హత గల ఉపాధ్యాయులు నేడు జరిగే ప్రత్యేక వైద్యశిబిరానికి రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరు కావాలని డిఇఒ తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవి ఆంజనేయులు తదితరులు

చలపతి ఫార్మశీలో 26న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - గుంటూరు

లాంలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఈనెల 26న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను చలపతి విద్యాసంస్థల అధినేత వైవి.ఆంజనేయులు, రామారావు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రముఖ ఫార్మా కంపెనీలైన నాట్కో, హెటిరో, అరవిందో కంపెనీలు ఎంపికలు చేపడతాయని, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బిఎస్‌సి, ఎంఎస్‌సి, డిప్లమా, ఐటిఐ, ఏదైనా డిగ్రీ కనీస విద్యార్హత కలిగిన వారు అర్హులని చెప్పారు. విద్యార్హత ధ్రువ పత్రాలు, బయోడేటాతో అభ్యర్థులు ఎంపికలో పాల్గొనాల్సి ఉంటుందని, స్క్రీనింగ్, ఇంటర్వ్యూలు, టెక్నికల్ రౌండ్ల ద్వారా ఎంపికలు ఉంటాయని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీల్లో నేరుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వార్డుల్లో పరిశీలన చేస్తున్న మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే

సమగ్ర పారిశుధ్యం కోసం మెగాక్లీన్ : మేయర్

ప్రజాశక్తి - గుంటూరు

వార్డుల వారీగా సమగ్ర పారిశుధ్య పనులను మెగాక్లీన్ ద్వారా చేపట్టి నగరాన్ని క్లీన్, గ్రీన్‌గా తీర్చిదిద్దుకుందామని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. 9, 10 వార్డుల్లోని సుద్దపల్లి డొంక, యాదవుల బజార్, అలీనగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్‌తో కలిసి మేయర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రెయినేజి, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని, వారంలో రెండు వార్డులను ఎంపిక చేసి మెగా క్లీన్ చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే కోరిక మేరకు మణిహోటల్ సెంటర్ నుండి బాలాజీ నగర్ రోడ్డును 60 అడుగులకు విస్తరిస్తామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతివార్డునూ మోడల్ వార్డ్‌గా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశామని చెప్పారు. వార్డులో సాధారణంగా విధులు నిర్వహించే కార్మికులతో పాటు అదనంగా 225 మంది కార్మికులతో ప్రతి వీధిని, డ్రెయిన్లను శుభ్రం చేయిస్తామని, అనధికార హోర్డింగులు, బోర్డులుంటే తొలగిస్తామని తెలిపారు. పాత గుంటూరు ప్రాంతంలో నూతన డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు, డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రెయిన్లపై ర్యాంప్‌లు, మెట్లు కట్టినవారు వాటిని తొలగించాలని లేకుంటే జిఎంసి సిబ్బందే తొలగిస్తారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కొందరు కార్యదర్శులు, సిబ్బంది విధుల్లో నిర్లిప్తంగా ఉంటున్నారని, పనితీరు మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఇ నాగ మల్లేశ్వరరావు, సిఎంఒహెచ్ డాక్టర్ అమతం, సిటిప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్లు వై.అశోక్, ఇ.వరప్రసాద్, షేక్ మీరావలి, ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

బదిలీలు, ప్రమోషన్లకు దరఖాస్తు చేసే సమయంలో ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బదిలీలు, ప్రమోషన్లపై స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బదిలీల చట్టం 2025 ప్రకారం ప్రస్తుత బదిలీలు జరుగుతున్నాయని, బదిలీల దరఖాస్తులో చాలా అంశాలు గతంలో ఉపాధ్యాయులు టిఐఎస్ ద్వారా అప్‌లోడ్ చేసిన సమాచారమే ఉంటుందని, దానిలో ఎలాంటి మార్పులూ ఉండవని తెలిపారు. ప్రత్యేక పాయింట్స్, రేషనలైజేషన్, ప్రాధాన్యత పాయింట్లు ఇతర వివరాలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అప్లికేషన్ పూర్తి చేసిన తర్వాత ఒకటికి రెండుసార్లు పరిశీలించుకున్న తర్వాత మాత్రమే సబ్మిట్ చేయాలన్నారు. సబ్మిట్ అనంతరం రెండు కాపీలు తీసుకొని డిడిఒకి ఇవ్వాలన్నారు. బదిలీల ఖాళీలు సరిచూసుకొని కోరుకోవాలన్నారు. జూన్ 12న పాఠశాలల పున:ప్రారంభం అయిన తర్వాత అదనంగా గంట బోధించటంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ అప్లికేషన్ ఎలా పూర్తి చేయాలో వివరించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ బదిలీల చట్టం రావటంలో, ఉపాధ్యాయుల పాయింట్స్ రావటంలో, పాఠశాలల స్ట్రక్చర్‌లోనూ యుటిఎఫ్ కృషి ఉందన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, బి.రంగారావు, ఎం.గోవిందు, బి.ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, ఎం.చిన్నయ్య, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటితరానికి ఎంతో అవసరమైన వ్యక్తి బొప్పన

అమరావతి రైతు ఉద్యమ గేయ రచయిత, 'రేపటికోసం' వ్యవస్థాపకులు బొప్పన విజయకుమార్ సంస్మరణ సభలో వక్తలు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక అధ్యక్షుడు, అమరావతి రైతు ఉద్యమ గేయ రచయిత, 'రేపటికోసం' వ్యవస్థాపకులు, విశ్రాంత పోలీసు అధికారి బొప్పన విజయకుమార్ సంస్మరణ సభ మంగళగిరి ఇప్పటం రోడ్లో గల వరుణ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై జరిగింది. ఈ సభకు అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక కార్యదర్శి, ప్రజాగాయకుడు పి.వి. రమణ అధ్యక్షత వహించారు. సభలో పలు సాహిత్య, సాంస్కృతిక, రైతు, కళా రంగాల నాయకులు, విశ్రాంత పోలీసు అధికారులు విజయకుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ- ఉద్యమాలను అణచివేసే పోలీసు వృత్తిలో వున్నప్పటికీ ప్రజా ఉద్యమాలను ప్రోత్సహించే మానవీయ కోణం విజయకుమార్‌లో చూశానన్నారు. సాహిత్య, సాంస్కృతిక కళా సంఘాలకు, ఉద్యమ సంఘాలకు ఆయన మరణం ఒక గొప్ప వెలితి అని ఆయన అన్నారు. రాజధాని ఐక్య కార్యాచరణ సమితి బాధ్యులు పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ- అమరావతి రైతు ఉద్యమంలో విజయకుమార్ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఎప్పటికప్పుడు ఉద్యమాన్ని చైతన్యవంతం చేయడానికి ఆయన చూపిన చొరవ, అందించిన సహకారం తెలుగుజాతి మర్చిపోదన్నారు. ప్రజా నాట్యమండలి పూర్వ కార్యదర్శి కాళిదాసు మాట్లాడుతూ- ప్రజా నాట్యమండలి కార్యక్రమాల్లో విజయకుమార్ నిర్వహించిన బాధ్యతాయుత పాత్రను గుర్తుచేసుకున్నారు. కళాకారులకు విజయకుమార్ అందించిన సహకారాన్ని చాలా ఆర్ద్రంగా చెప్పారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, రేపటికోసం మాసపత్రిక అసోసియేట్ ఎడిటర్ కలిమిశ్రీ మాట్లాడుతూ- పత్రిక నిర్వహణలో తనకు ఎంతో స్వేచ్ఛనిచ్చేవారన్నారు. విజయకుమార్ రాసిన సంపాదకీయాలు ఎంతో స్ఫూర్తివంతంగా వుండి, మేధావుల్ని సైతం కదిలించాయన్నారు. ఈ పత్రిక ద్వారా ఎంతోమంది కొత్త రచయితల్ని, కార్టూనిస్టుల్ని, చిత్రకారుల్ని ప్రోత్సహించారన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, అమరావతి పరిరక్షణ సమితి - అధ్యక్షుడు పి.వి.మల్లికార్జునరావు, మంగళగిరి బుద్ధవిహార వ్యవస్థాపకుడు రేకా కృష్ణార్జునరావు తదితరులు పాల్గొని విజయకుమార్ వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విజయకుమార్ కుమార్తెలు సునీలా శ్రీనివాసిని, నీలిమా దుర్గ మాట్లాడుతూ - ఇంతమంది మేధావుల అభిమానాన్ని సంపాదించుకున్న నాన్నకు కూతుర్లుగా పుట్టడం ఎంతో గర్వకారణంగా వుందన్నారు. ఈ సభలో ప్రజాగాయకులు లెనీనా, రంగం రాజేష్, కంచర్ల కాశయ్య గీతాలు ఆలపించారు.

భద్రతా చర్యల్లో భాగంగా రాజధానిలో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - తుళ్లూరు

వివిఐపిలు, విఐపిలు ప్రయాణించే రహదారిలో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి గుంటూరు జిల్లా భద్రతా విభాగం గురువారం రాజధాని అమరావతిలో ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. తుళ్లూరు డీఎస్పీ మురళి కృష్ణ, డి ఎస్ డబ్ల్యూ ఆర్ఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సీడ్ యాక్సిస్ రోడ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ ను పర్యవేక్షించి, భద్రతా విభాగ పోలీస్ సిబ్బందికి జిల్లా అదనపు ఎస్పీ ఎ హనుమంతు కొన్ని సూచనలు చేశారు. ఆధునిక సాంకేతిక భద్రత పరికరాలు, శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో సీడ్ యాక్సిస్ రోడ్ ప్రారంభం నుంచి ఎన్9 జంక్షన్ వరకు సీడ్ యాక్సెస్ రోడ్డులోని డివైడర్లు, చెట్ల పొదలు, పూల మొక్కలు, రోడ్డుకి ఇరువైపులా ఉన్న కల్వర్టులు, వంతెనలు, తూములు వంటి పలు ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టడం జరిగింది. భద్రతా తనిఖీల కచ్చితత్వాన్ని పరీక్షించడానికి, జాగిలాల పనితీరుని అంచనా వేయడానికి సీడ్ యాక్సెస్ రోడ్డులోని ఒక చోట ఒక ప్రేలుడు పదార్థాన్ని గోప్యంగా పెట్టడం జరిగింది. బాంబు డిస్పోసల్ విభాగానికి చెందిన ఒక జాగిలం ఎంతో చాకచక్యంగా గోప్యంగా ఉంచిన సదరు ప్రేలుడు పదార్థాన్ని కనిపెట్టిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను మెరుగు పరచడానికి మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని చెప్పారు. మా బాంబు డిస్పోజల్ టీం భద్రతా సిబ్బంది అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.వారి తనిఖీల పట్ల సంతప్తికరంగా ఉన్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మాక్ డ్రిల్స్ నిర్వహించి ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని అన్నారు. తుళ్లూరు డిఎస్పీ మురళీ కృష్ణ మాట్లాడుతూ, సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ఎటువంటి ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. బాంబు డిస్పోసల్ టీం సహకారం, సమన్వయంతో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలను మెరుగు పరుస్తూ వస్తున్నామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు భద్రతతో పాటు ఈ ప్రదేశంలో వివిధ నిర్మాణ పనులకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికుల వివరాలను కూడా సేకరిస్తున్నామని, అన్ని దిశల్లో భద్రతలను కట్టుదట్టం చేసే విధంగా కషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సిఐ కొంకా శ్రీనివాస్ తుళ్లూరు ట్రాఫిక్ సిఐ కోటేశ్వరరావు ఎస్బి సిఐ శ్రీహరి, జిల్లా భద్రతా విభాగ ఆర్ఐ సురేష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు